
కథ

# చేయిచాచిన వెన్నెల

వై. శ్రీరాములు



''ఏం సారూ....బాగున్నారా?''

అప్పటిదాకా మా అమ్మాయి శ్రీలక్ష్మితో సరదాగా మాట్లాడుతున్న నేను తలెత్తి చూసాను. ఈ కాలంలో కూడా ఇంత సంస్కారం ఎక్కడిదా? అనుకుంటూ...

చాలీచాలని ఫ్యాంటు, ఒకటి, రెండు చోట్ల చిరుగులతోటి షర్టు, వాటిని దాచాలనే ఆ పసితనం. తైల సంస్కారం లేకుండా నిర్లక్ష్యంగా అస్తవ్యస్తంగా వున్న జుట్టు. ఎంత కష్టాన్నయినా చేయకతప్పదననిపించే వాడి కళ్లల్లో సంసిద్ధత, నవ్వుతున్నా అలసత్వం కొట్టొచ్చినట్లు కనపడే ఆ ముఖం చూస్తుంటే ఒక్కసారిగా పదిరోజుల కిందట జరిగిన ఒక సంఘటన గుర్తొచ్చి

''ఆ !! నువ్వా మల్లేశూ... బావున్నావా?'' అంటూ వాడి భుజం పై చెయ్యివేశాను.... ఆప్యాయంగా.

ఆ మాత్రానికే ప్రపంచాన్ని జయించినంతగా వాడి ముఖంలో ఆనందం...

నాకు మాత్రం పాపం.... అనిపించింది.

నాకు నా కుటుంబంతో పాటు ఓ వారానికో, ఏ పదిరోజులకో ఇక్కడికి రావడం అలవాటే.. ఈ మధ్య ఎప్పుడూ ఇక్కడే వుండే మల్లేశు ఆ రోజు ఆ సంఘటన జరిగిన తర్వాత కనపడలేదు. అదే విషయాన్ని అంత వివరంగా కాకున్నా ''ఏం మల్లేశూ... ఈ మధ్య కనపడడం లేదు అన్నాను,ఎంతో చనువుగా...

''మరి... మరి... నా చుట్టూ వున్న నా కుటుంబ సభ్యులను గమనించి చెప్పాలా వద్దా అనిపించిందేమో.... ఏదో సంశయంగా నాకేసి తదేకంగా చూస్తూ... ఇంతకు ముందు తిన్నవారి ప్లేట్లను తీసేస్తూ... చేతిలో వున్న తడిబట్టను టేబుల్‌ను శుభ్ర పరుస్తూ... మా వంకే దీనంగా చూస్తున్న మల్లేశు తీరు నాకు

''ఏతల్లి కన్నబిడ్డో'' అనిపించింది జాలిగా... ఇంతలో ఇవన్నీ గమనిస్తున్న మా శ్రీలక్ష్మి... ''ఎవరునాన్నా ''....!! అంటూ అడిగింది. అతను అని చెప్పబో యేంతలో.. సర్వర్ రావడం.... ''ఏం కావాలి సర్'' అని అడగడం, అప్పటిదాకా మెనూకార్డును తిరగే స్తున్న నాకొడుకు మెను ఆర్డరివ్వడం...అవి విని అన్నెందుకు ఎలాగూ ఇంటికే వెళుతున్నాం కదా....!! అంటూ నా భార్య కొన్ని ఐటమ్స్ తగ్గించడం లాంటివి ఎప్పుడూ అలవాటే అయినా వెంట వెంటనే జరిగిపోయాయి. ఇలాంటప్పుడే అనిపిస్తుంది. కుటుంబంతో పాటు ఏదో మార్పు అంటూ వేరే చోటకు వెడతామే కానీ... స్థలం మారినంత మాత్రాన ఎవరి ఆలోచనల్లోనూ మార్పురాదు కదా!!!! అని...

మా మధ్య ఆ కాస్సేపటిలో ఎన్నో సంఘటనలు, ఎన్నో ఆలోచనలు జరుగుతున్నా అవన్నీ గమనించని మా శ్రీలక్ష్మి ''నాన్నా ఇతనెవరు'' అంటూ మళ్లీ అడి గింది.

చేస్తున్నది సర్వర్ ఉద్యోగమయినా అతను అంటున్న మా శ్రీలక్ష్మి సంస్కారానికి సంతోషపడుతూ...అసలు రెండుసార్లు వేరెవర్ని అడిగించుకోవడం, నేను వేరొకర్ని రెండోసారి అడగడం అలవాటు లేని నేను ఈ విషయం చెప్పడం వీళ్లకు అవసరమా? అని ఒక్కసారి ఆలోచించి....సర్వర్ ఆర్డర్ ఇచ్చినంతవరకు ఆగి.. నా కూతురు శ్రీలక్ష్మి వైపుకు చూస్తూ చెప్పడం ఆరంభించాను.

''ఇంతకు ముందు ఈ మల్లేశు, ఒక నాన్‌వెజ్ హోటల్లో పనిచేసేవాడు. ఒకరోజు అదే నా మిత్రుడు వేరే దేశం వెళ్లే సందర్భంగా మా స్నేహితులందరికీ పార్టీ ఇచ్చాడు.

''ఆ... ఆరోజు నువ్వు చాలా ఆలస్యంగా వచ్చావు '' ఆరోజేనా? అంటూ అడిగింది శ్రీలక్ష్మి.

సాధారణంగా పిల్లలు అంతే... వారికి తెలియబోయే విషయం ఎంతో కరక్టుగా వుండాలనే వారి వుద్దేశ్యం... అయినా వెంటనే నేను కలియజేసుకుని......

''శ్రీలక్ష్మి...!! నువ్వు చెప్పేది విను...'' అంటూ ఆ తర్వాత మా స్నేహితునికి కాఫీ ఇస్తుండగా కాస్త తేడా వచ్చి వొలికి అతని షర్టుమీద పడడం... అతను అదే భాస్కర్ మల్లేశు చెంప ఛెళ్లు మనిపించడం జరిగింది. ఆ పిల్లవాడి చెంపపై వాడిగా పడ్డ ఆ వేళ్ల గుర్తులు...కొలిమిలో ఎర్రగా కాలిన ఇనప చువ్వల్లా అవుపించాయి. ఒకవైపు ఆ బాధకు కన్నీళ్లు ధారగా కారుతుంటే పాపం నోట మాటరాక నిశ్చేష్టుడై నిలబడిపోయాడు...

అది వినగానే ''అయ్యోపాపం..'' నువ్వు అడగాల్సింది నాన్నా... ఎందుకలా కొట్టావని..'' అంది అమాయకంగా...


మధ్యలో అలా మాట్లాడడం నాకు ఇష్టం లేకున్నా తనదీ పసితనమేగా...బతుకు విధానంలో మార్పులున్నా స్పందించే హృదయంలో మాత్రం ఏమాత్రం మార్పుండదని మరోసారి రుజువయ్యింది మా శ్రీలక్ష్మి బాధ చూస్తుంటే....అయినా ముందు ''నువ్వు వినమ్మా...'' అన్నాను కాస్త చికాగ్గా ముఖం పెట్టి....

నా చిరాకు ముఖం తనకు కాస్త కంగారు పెట్టిందేమో...''సరే నాన్నా... ఇంకేం అడగనులే...'' అంది బుంగమూతితో శ్రీలక్ష్మి.

మొదట ఈ విషయంపై శ్రీలక్ష్మి మాత్రమే శ్రద్ధ కనబరిచినా చెప్పుతున్న కొద్దీ ఈ విషయంపై నా భార్య కొడుకు కూడా వినడం మొదలు పెట్టారు. వారిని గమనిస్తూ...

నేను మళ్లీ చెప్పడం ఆరంభించాను. ఆ తర్వాత జరిగిన చర్య నాతో పాటు అక్కడున్న మిత్రులందరినీ మౌనంలోకి పంపింది. అప్పటి దాకా ఎంతో సందడిగా మాట్లాడుకుంటున్న మేము ఒకరికొకరం ఏం మాట్లాడాలో తెలియని స్థితిలోకి వచ్చాము. నాకు మాత్రం కన్నీళ్లతో నిలబడ్డ మల్లేశు ఒక్కడే కనిపిస్తున్నాడు.

నిజానికి ఆ పిల్లవాడు మాకు చాలా రోజులుగా తెలుసు. మేము ఎప్పుడు వెళ్లినా నవ్వు ముఖంతో మాకేం కావాలో అడిగి ఆలస్యం చేయకుండా




తెచ్చిస్తూ వుంటాడు. ప్రతిసారి ఎంతోకొంత చేతిలో వుంచుతున్నా ఒక్కోరోజు మల్లేశుకు ఇవ్వడానికి చిల్లర కూడా మిగలదు. అలాంటప్పుడు కూడా ''ఏం పర్లేదు సర్...'' అంటూ అదే నవ్వుతో మమ్మల్ని పంపడం నిజంగా మల్లేశు దగ్గరున్న గొప్పగుణం. మమ్మల్ని చూస్తే చాలు ఆ పిల్లవాడిలో కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. మాలో మేము జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటూంటే మా నవ్వులకు అర్థం తెలియకున్నా, కేవలం మా నవ్వుల్ని మాత్రం దూరం నుండి గమనిస్తూ తను నవ్వుకుంటూ మాలో తానొకడిగా వున్నట్లు భావిస్తుంటాడు. అలాంటి పిల్లవాడిని కొట్టడానికి మా మిత్రుడికి చేతులెలా వచ్చాయో అర్థం కావడం లేదు. నా మనసంతా ఎంతో కలచివేసింది.

చేసిన తప్పు ఒప్పుకోకున్నా ఫర్వాలేదు. అలా కాకుండా తను చేసిన పనిని సమర్థించుకుంటున్నాడు మా మిత్రుడనే దౌర్భాగ్యుడు. అప్పటికి ఆ పిల్లవాడు చేయరాని తప్పేదో చేసినట్లు అందరికి వివరిస్తున్నాడు. కూల్‌డ్రింక్స్‌కు ఇచ్చిన డబ్బులో రెండు రూపాయలు తక్కువిచ్చాడని, మోసం చేసాడని, దొంగనా కొ.... అంటూ గట్టిగా ఒక పశువులా అరుస్తున్నాడు. కానీ మేమెవరం వినడం లేదు. జరిగిన చర్య అతనిపై అసహ్యానికి గురిచేసిందనేది వాస్తవం. మా అసహనానికి మౌనమే నిదర్శనం.

ఇంత చేసినా తాను చేసింది తప్పుకాదనేది మా మిత్రుని అభిప్రాయం. మాలో ఒకరు వినీ విననట్లు, మరొకరు దృశ్యాన్ని చూసీ చూడనట్టున్నా జరిగిన విషయం అందరినీ ఆలోచింపచేస్తున్నది నిజం.

''నేను చేసింది కరెక్టే'' మత్తులో అంటున్నాడు. తనకు తానే గిల్టీ ఫీలవుతూ అందరి దగ్గరా సర్టిఫికెట్ కోసం ప్రయత్నిస్తున్నాడు. అయినా అందరి దగ్గరా మౌనమే సమాధానం. గుచ్చి గుచ్చి ఒక్కొక్కర్ని తాను చేసిన పని తప్పుకాదనిపించాలనే వాడి ప్రయత్నం. తన పని సరైందనే గంభీరోపన్యాసం. చివరికి ఒకరేమో తలవూపుతున్నారు. ఒకరేమో.... ఏమీ జరగలేదనుకో అంటూ అనునయిస్తున్నారు. వారి మనసుల్లో తప్పని తెలుస్తున్నా.... ఆ దౌర్భాగ్యుడి సహాయంతో బ్యాంకు లోన్లు పొందినవారు, వడ్డీకి డబ్బు ఇచ్చే ఆ హృదయాన్ని ఎక్కడ కోల్పోతాయోననే భయం.

ఇక మిగిలింది. నేనొక్కడ్నే.... అందుకే నన్ను కూడా బలవంతంగా వాస్తవాన్ని మెప్పించాలనే ప్రయత్నం చేస్తూనే వున్నాడు. ఇక నా వల్లకావడం లేదు. తట్టుకోవడం మౌనం కూడా మనిషిన బాధిస్తుందనడం ఈ సంఘటన చాలు. నా అనుభవాలే సజీవ ఉదాహరణం. నాలో సహనం నశించింది. నా నుంచి సమాధానమొచ్చింది. మాటలు పెదాల మధ్య నుంచి రాలేదు. గుండె లోంచి వచ్చాయి. ''ఆ పిల్లవాడి స్థానంలో నీ కొడుకునో...నీ కూతురునో ఊహించు'' అన్నాను అంతే...నిశ్శబ్దం....

ఆ మాటలు విన్న నా కూతురు చెయ్యి ఎంతో నమ్మకంగా..నిశ్చితంగా నా చేతిపై పడడం నేను గమనించాను. నా ప్రవర్తన సరైనదేననిపించి...కాస్సేపాగిన తర్వాత క్షణం నిలబడలేదు మేమెవరం. ఎవరికి వాళ్లు వెళ్లిపోయాం.

ఇదంతా ఎంతో ఆసక్తితో విన్న నా కుటుంబ సభ్యులు కాస్సేపు శిలాప్రతిమల్లా నా వైపు చూస్తుండిపోయారు. ముందుగా నా కూతురు తేరుకొని.....

''మరి ఇలాంటి వీళ్లందరినీ ఎవరు కాపాడతారు నాన్నా....'' అడిగింది అమాయకంగా.

''అందరిని కాపాడడం ఎవరి వల్లా కాదమ్మా...కాకుంటే మనకు వీలయినంతలో కాస్త అభిమానంతో పలకరించి..మనకు తోచిన సహాయం చేస్తూంటే అదే సహాయం'' అంటూ బిల్లు చెల్లించి మా వాళ్లతో పాటు బయటకు కదిలాను. అంతలో మల్లేశు చేతిలోకి మరో పది రూపాయలు చిరునవ్వుతో ఇస్తున్న మా కొడుకును చూసాను.

మరింత ప్రేమగా నా భార్య మల్లేశు తలపై చెయ్యి వేయడం చూసాను. నా మాటలు వాళ్లకు అర్థమయినందుకు సంతోషించాను. నా దారిలో నా ఆశయంలో నాతో పాటు కదులుతున్న నా కుటుంబంతో ప్రేమకు విలువను సాధించాననే గర్వంతో మల్లేశుకు వెళ్లొస్తానని చెప్పి మరీ కదిలాను నిశ్చింతగా...

★